క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

చింతపల్లి : మండలంలోని తీదేడు గ్రామానికి చెందిన జక్కుల పర్వతాలు ఇటీవల మృతిచెందారు. శనివారం మృతుడి కుటుంబ సభ్యులను గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించి రూ.13వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సానగంటి గోవర్ధన్ ఆచారి, తీదేడు గ్రామ పీఏసీఎస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షులు రామారావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, కాయితి బచ్చిరెడ్డి, మాదగోని కృష్ణ గౌడ్, వీరమల్ల జగదీష్, వెంకటయ్య, రాములు, పాండయ్య, రాములు, శాయిలు, మునగాల అశోక్, మెండె యాదయ్య, మల్లయ్య, రాములు పాల్గొన్నారు.

మెనూ తప్పని సరిగా అమలు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, కళాశాల బాలుర వసతి గృహంలో శుక్రవారం రాత్రి ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర కోటేశ్వర్‌రావు బస చేశారు. శనివారం ఉదయం అల్పాహారం చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలలో ఉన్న మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని, రాత్రి వేళల్లో ప్రత్యేకంగా స్టడీ అవర్ అమలు చేయాలన్నారు. తనిఖీ సమయంలో ఉన్న సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

డిండి : పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన తోకల మురళి, ఎండీ ఖదీర్, వరికుప్పల రమేష్, గోరటి జైపాల్, గోరటి సైదులు, దూల ఆలెందర్ గ్రామ సమీపంలోని చాకలిగుట్టపై పేకాట ఆడుతున్నారు. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకోగా సైదుల, ఆలెందర్ పారిపోయినట్లు ఎస్ఐ.రాజు తెలిపారు. ఘటనా స్థలంలో దొరికిన రూ.2760 నగదుతోపాటు రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లు సీజ్ చేసామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు

త్రిపురారం : వాహనదారులు రోడ్లపై నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించడంతో పాటుగా కేసులు నమోదు చేస్తామని నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు హెచ్చరించారు. శనివారం నిడమనూరు మండలంలోని ముకుందాపురం వద్ద వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పరిమితికి మించి ప్రయాణిస్తున్న ఆటోలను ఆపి నిబంధనలు అతిక్రమించిన ఆటోలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల వ్యాపారులపై కేసు నమోదు

గుర్రంపోడు : మండలకేంద్రానికి చెందిన చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గంగసాని అంజయ్య అతడి కుమారుడు గంగసాని సతీష్‌లు తమను మోసగించారని 30మంది బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పసుపులేటి మధు తెలిపారు. చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న వీరి వద్ద చిట్టీల వేయగా వీరు పరారీ కావడంతో సుమారు రూ. 80 లక్షల మేరకు నష్టపోయామని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మండలకేంద్రంలో పూలు, పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్న దాసరి శంకర్ తాను పది లక్షల మేర నష్టపోయామని, ఇలా మరో 29మంది తాము నష్ట పోయామంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

చిరుకు జైకొడుతున్నారు

చిరుధాన్యాల టిఫిన్స్‌పై పెరుగుతున్న ఆసక్తి

- క్రీడా మైదానాల వద్ద వెలుస్తున్న స్టాల్స్
- అందుబాటులో విభిన్న రకాల జ్యూస్‌లు

సండే స్పెషల్



ఆధునిక జీవితంలో ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో రోజు రోజుకూ అవగాహన పెరుగుతుంది. ప్రసార మాధ్యమాలు, వైద్య నిపుణుల సలహా మేరకు ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధతో మిత ఆహారం మేలని అన్ని వయస్సుల వారు గ్రహిస్తున్నారు. ఈక్రమంలో చిరుధాన్యాలు, రాగిజావా, జొన్నగటుక, మొలకెత్తిన ధాన్యాలను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహారంగా తీసుకుంటున్నారు. నిత్యం తీసుకునే ఆహారం పదార్థాలకు భిన్నంగా ఆలోచన చేస్తూ రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నారు.

– మిర్యాలగూడ అర్బన్



ఎన్నెస్పీ క్యాంప్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన వివిధ రకాల జ్యూస్ స్టాల్ వద్ద జ్యూస్ తాగుతున్న ప్రజలు

చిరుధాన్యాలతో అల్పాహారం..

పలు క్రీడా మైదానాలు, వాకింగ్ చేసే పార్కుల వద్ద చిరుధాన్యాలు, జ్యూస్‌లు అందించే విక్రయాలు పెరిగిపోతున్నారు. పట్టణంలోని పలు టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు రుచికరమైన రాగులతో చేసిన ఇడ్లీ, దోశ, కొర్రల ఉప్మా, మిల్లెట్ దోశలు తయారు చేస్తూ విక్రయాలు జరుపుతూ ఉపాధిని పొందుతున్నారు. వీటిలో పీచు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఎక్కువగా లభించడంతో పాటు కొవ్వు శాతం తక్కువగా ఉన్నందున షుగర్, అధిక బరువుతో బాధపడుతున్న వారు ఆ రకమైన అల్పాహారాన్ని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.



ఎన్నెస్పీ క్యాంప్ గ్రౌండ్ వద్ద రాగి, జొన్న, గటక స్టాల్

విభిన్న రకాల జ్యూస్‌లు..

ఉదయం వేళల్లో క్రీడా మైదానాలు, పార్కుల బాట పట్టిన పలువురు వ్యాయామం పూర్తి కాగానే సమీపంలోని జ్యూస్ కేంద్రాలను ఆశ్రయించి తమకు నచ్చిన జ్యూస్‌లను సేవిస్తున్నారు. దీంతో పట్టణాల్లో వివిధ ప్రాంతాల్లో పలు రకాల జ్యూస్‌ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. బూడిద గుమ్మడికాయ, సొరకాయ, క్యారెట్, బీట్‌రూట్, మునగాకు, గోధుమగడ్డి, కలబంధలతో జ్యూస్‌లు తయారు చేసే కేంద్రాలు పట్టణాల్లో పెరిగిపోయాయి. వీటిల్లో అధిక పోషక విలువలు ఉంటాయని పలువురు వైద్య నిపుణులు తెలపడంతో ఊబకాయం, వివిధ రకాల రుగ్మతల నివారణ కోసం జ్యూస్ కేంద్రాల వద్దకు ప్రజలు బారులుదీరుతున్నారు.

రోజూ జ్యూస్ తాగడం అలవాటైంది



ప్రతి రోజు ఉదయం వ్యాయామం పూర్తికాగానే పోషక విలువలు కలిగిన జ్యూస్‌లు తీసుకుంటున్నా. గతంలో ఇలాంటి స్టాళ్లు ఇక్కడ లేకుండే. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా నూతనంగా రకరకాల జ్యూస్‌లు లభించే స్టాల్స్ ఏర్పాటు చేయడం మంచి పరిణామం. ధరలు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో ప్రతిరోజు ఏదో ఒక జ్యూస్ తాగడం అలవాటుగా మారింది.

-బి.వెంకటేశ్వర్లు- మిర్యాలగూడ

ప్రజలు ఆసక్తి చూపుతున్నారు



ఎంబీఏ చదివాను.. వేములపల్లి మండల కేంద్రంలో గల మోడల్‌స్కూల్ కాంట్రాక్ట్ మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తూనే ఉదయం పూట వివిధ రకాల కూరగాయాలు, బూడిద గుమ్మడికాయ, సొరకాయ, క్యారెట్, బీట్‌రూట్, మునగాకు, గోధుమగడ్డి, కలబంధలతో జ్యూస్‌లు తయారు చేసి విక్రయిస్తూ మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నాను. ప్రజలు కూడా అవగాహన పెంచుకుని వివిధ రకాల జ్యూస్‌లను తాగేందుకు ఆసక్తి చూపుతుండటంతో గిరాకీ కూడా బాగానే ఉంది.

-జి.సుందర్- జ్యూస్ తయారీదారుడు, మిర్యాలగూడ

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కృషి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

వేములపల్లి(మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండల కేంద్రంలో మూడు ప్రభుత్వ నూతన కార్యాలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణానికి నిర్ణయించిన స్థలాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నందున మండల కేంద్రంలో మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. త్వరలో టెండర్లను పిలిచి కార్యాలయాల నిర్మాణాలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో తిరుమలస్వామి, ఆర్ఐ రేణుక తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాల నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొనసాగుతున్న నక్ష రీ సర్వే



పాయింట్లను పరిశీలిస్తున్న సర్వే టీం

మిర్యాలగూడ టౌన్ : సర్వే ఆఫ్ ఇండియా టీం శనివారం రెండో రోజు కూడా నక్ష రీ సర్వే కొనసాగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇటీవల కాలంగా సర్వే ఆఫ్ ఇండియా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్(జీసీపీ) 20 కాగా ఆర్‌వీ సంస్థ వారు మరో 10 పాయింట్లను గుర్తించారు. ప్రైవేటు సంస్థ గుర్తించి ఏర్పాటు చేసిన 10 పాయింట్లను సర్వే ఆఫ్ ఇండియా టీం రీ సర్వే చేసి సక్రమంగా ఉన్నాయా.. లేవా అని దానిపై సర్వే ఆఫ్ ఇండియా సర్వేయర్ ఎం.రంగస్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ నక్ష కింద పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక అయిందని, ఈ సర్వేతో మున్సిపాలిటీలోని గృహాలు, సీసీ రోడ్లు, భవనాలు, ఆస్తులతో పాటు ఖచ్చితమైన కొలతలతో పూర్తి స్థాయిలో మ్యాప్ రూపకల్పన చేయనున్నట్లు ఆయన తెలిపారు. సర్వే ఆఫ్ ఇండియా సర్వేయర్‌తో పాటు టీం సభ్యులు గో ఫీటర్, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది సైదులు తదితరులున్నారు.

అన్ని పార్టీల నాయకులు సహకరించాలి

- సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ : పట్టణంలోని సాగర్ రోడ్డులో ఉన్న వీధి దుకాణాదారులను ఇతర ప్రదేశాలకు తరలించేందుకు అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజులు కోరారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వీధి దుకాణాదారులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు చోట్ల వీధి విక్రయదారుల కోసం స్థలాలను ఎంపిక చేశామని, వీటిని విక్రయదారులు, నాయకులందరూ కలిసి పరిశీలించి వారికి అనుకూలమైన ప్రదేశానికి తరలివెళ్లేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. మిర్యాలగూడ పట్టణానికి ఉన్న ఒక ప్రధానమైన రోడ్డు సాగర్‌రోడ్డు అని దీనికి ఇరువైపులా వీధి దుకాణాదారులు ఉండడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని వీరిని ఇతర ప్రదేశాలకు తరలించి వారి ఉపాధి మార్గాలు ఎప్పటిలాగే ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐలు నాగార్జున, వీరబాబు, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ శర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

కనీస సౌకర్యాలు కల్పించాలి

రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు అధికారులు కనీస సౌకర్యాలు కల్పించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులు, అధికారులతో ముస్లిం మత పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రంజాన్ మాసంలో తాగునీరు, విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, ఎంపీడీఓలు శేషగిరిశర్మ, శ్రీనివాసమూర్తి, ఎంపీవో మాతంగి రమేష్, విద్యుత్ ఏడీఏ కె.రవికుమార్, సీఐలు నాగార్జున, వీరబాబులు పాల్గొన్నారు.

మైనార్టీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలో ముస్లిం, మైనార్టీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సయ్యద్ షబ్బీర్, ఉపాధ్యక్షులుగా షేక్ గౌస్, కార్యదర్శి షేక్ అస్గర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా కాషీం(చంటి) అబ్దుల్ ఘని, కోశాధికారిగా రహమత్ అలీ,కార్యవర్గ సభ్యులుగా నజీర్,షరీఫ్,అన్వర్,ఇక్బాల్,హమీద్ తదితరులు ఎన్నికయ్యారు.

పాపయ్య మృతి సీపీఐకి తీరనిలోటు

చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు వడ్లకొండ పాపయ్య మృతి ఆ పార్టీకి తీరనిలోటు అని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పాపయ్య కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జయిని రత్నాకర్ రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరినాధరావు, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో మెలగాలి

హాలియా : క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని, యువతులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. సోమేశ్వర స్వామి కల్యాణోత్సవం, జాతర సందర్భంగా అనుముల మండలంలోని పేరూర్‌లో ఐదు రోజుల పాటు నిర్వహించిన జిల్లా గ్రామీణ కబడ్డీ, కోలాటం, ముగ్గుల పోటీలు శనివారంతో ముగిశాయి. వివిధ క్రీడల్లో పోటీల్లో గెలుపొందిన విజేతలకు వారు బహుతులు అందజేసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కొండారెడ్డి, వికారాబాద్ సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు, పీఈటీ రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనయ్య, పెద్ద నర్సింహ, యడవెల్లి సునిత, వెంకన్న, రాంబాబు, సైదాచారి, పాండునాయక్ తదితరులు ఉన్నారు.



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వేములపల్లి : విద్యార్థులు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు విద్యార్థుల మెనూను పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, పుట్టల కృపయ్య, రేగట్టి రవీందర్, ప్రిన్సిపాల్ వీణ సుజాత, ఉపాధ్యాయులు ప్రసాద్, అంజయ్య, ఉపేందర్, జానకి రాములు, మల్లేష్, పురుషోత్తం, కోటేష్, రాజేష్, మీనాక్షి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

దేవరకొండ : మండలంలోని ముదిగొండ శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం స్వామి వారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాలయంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ రథోత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు ఆయనకు స్వామి వారి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలంపల్లి నర్సింహ్మ, వెంకటయ్యగౌడ్, రుక్మారెడ్డి, పాపానాయక్, నల్లగాసు జాన్‌యాదవ్, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, శిరందాసు కృష్ణయ్య, హరికృష్ణ, తదితరులున్నారు.

చింతపల్లి: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో శనివారం తెల్లవారు జామున రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ యువకులు గ్రామ పురవీధుల్లో రథాన్ని లాగి భక్తిభావం చాటుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దేవరకొండ : రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి



మిర్యాలగూడ : పంచాయతీ కార్యదర్శుల సంఘం మిర్యాలగూడ మండల అధ్యక్షుడిగా నూకల వేణుగోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానికంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో మండల అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డిని పంచాయతీ కార్యదర్శులు ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి అండగా ఉంటానని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి

కొండమల్లేపల్లి : మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్య మాదిగ ఆధ్వర్యంలో మాదిగ అమర వీరులకు నివాళులర్పించారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం అమరులైన వారిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిరాల రమేష్‌మాదిగ, సాలయ్య, వస్కుల లక్ష్మణ్, అందుగుల శ్రీనుమాదిగ, యాదన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులకు మండలంలోని పోచంపల్లి గ్రామంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు యాదయ్య, సీనియర్ నాయకులు సత్తయ్య మాదిగ, శ్రీనయ్య, నర్సింహ్మ, శంకరయ్య, సుధాకర్, తేజ, పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామలింగేశ్వర స్వామి దేవాలయ భూములు వేలం

వేములపల్లి : మండలంలోని ఆమనగల్లు గ్రామంలోని శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ భూములను దేవాదాయశాఖ అధికారి మృత్యుంజయశాస్త్రి ఆధ్వర్యంలో శనివారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 31ఎకరాల దేవాలయ భూమికి వేలం నిర్వహించగా సర్వేనంబర్ 48లో 5.20 ఎకరాల భూమిని ముండ్ల కల్యాణ్ రూ.1.71లక్షలకు, సర్వే నంబర్ 776/1లోని 7ఎకరాల భూమిని ముండ్ల శివ రూ.55వేలకు, సర్వే నంబర్ 766/2లోని 4 ఎకరా భూమిని వల్లంపట్ల వెంకటేశం రూ.70వేలకు, సర్వే నెం.300లోని 2.20ఎకరాల భూమిని నార్ల అజయ్ రూ.33వేలకు, సర్వే నెం.290లోని 1.20ఎకరాలను కోల సైదులు రూ.20వేలకు, సర్వే నెం.289లోని 1.31 ఎకరాల భూమిని పెరుమాళ్ల అమృతయ్య రూ.41వేలకు, సర్వే నెం .49లోని 15.22 ఎకరాల భూమిని దేవాలయం కమిటీ సభ్యులు రూ.1లక్షలకు వేలంలో దక్కించుకున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా కొబ్బరి కాయల వేలం నిర్వహించగా నార్ల అజయ్ రూ.50వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు.

ముగిసిన ఇష్టకామేశ్వరస్వామి ఆలయ జాతర



అగ్నిగుండాల నుంచి ప్రవేశం చేస్తున్న భక్తులు

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం గ్రామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శ్రీ ఇష్టకామేశ్వరస్వామి జాతర ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేకువజామున దేవాలయం ముందు అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకిలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులు శివ, శివ అంటూ అగ్నిగుండాల నుంచి నడిచారు. అనంతరం ఆలయ పూజారులు శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అనంతరామశర్మ, గ్రామస్తులు కూన్‌రెడ్డి రామాంజిరెడ్డి, నక్కల నాగిరెడ్డి, కూన్‌రెడ్డి శేషిరెడ్డి, కాసర్ల శంకర్, విజయారెడ్డి, శంకర్‌రెడ్డి, లింగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సత్యంరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

దేవరకొండ : తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలను విజయవంతం చేయాలని దేవరకొండ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగిడిమర్రి నాగరాజు,గాజుల వినయ్,శిరందాసు కృష్ణయ్య,ఏలే యాదయ్య, అంకం చంద్రమౌళి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

డిండి : మండల పరిధిలోని దాసరి నెమలిపురంలో నేటి నుంచి ఈనెల 6వతేదీ వరకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన 38వ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం శ్రీ పద్మావతి శ్రీనివాసుల స్వామి వారి కల్యాణం, గురువారం రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అన్ని ఏర్పాట్లుపూర్తి చేసినట్లు ఆలయ చెర్మన్ వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



మిర్యాలగూడ : కల్లెపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు



అడవిదేవులపల్లి : ఎంపీఎస్ హరిజన పాఠశాలలో..



పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి ప్రాథమిక పాఠశాలలో..



పెద్దవూర: పోతునూరు ప్రాథమికోన్నత పాఠశాలలో



గుర్రంపోడు : పిట్టలగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో..



గుర్రంపోడు : నడికూడ జెడ్పీహెచ్ఎస్‌లో..